# అందరం ప్రేక్షకులమే

నన్ను వెంటనే రమ్మని టెలిగ్రాం యిప్పించింది కౌసల్య. కౌసల్య ఎవరో కాదు. నాకు తోడబుట్టిన చెల్లెలే.

చేసేది లేక ప్రయాణమై బయలుదేరాను. గానీ.... బుర్రంతా రకరకాల ఆలోచనలతో గజిబిజిగా ఉంది. ఎందుకింత అర్జంటుగా రమ్మందీ? అనేది భూత మంత్ర ప్రశ్నగా ఎదురుగా నిలిచింది. క్షేమం అని ముందుగా పెట్టారు. కనుక సరిపోయింది. లేకుండా అయితే మరో విధంగా ఉండేది పరిస్థితి.

ఏమై ఉంటుంది?

రుక్కూకేమైనా పెళ్ళి సబంధం వచ్చిందేమో?

వాళ్ళాయనికి ఏ దూరప్రాంతమైనా బదిలీ అయిందో? ఏమో? కుర్ర సన్నాసి సతీష్‌గాడు సరిగ్గా చదవక ఇబ్బంది పెడుతుంటే గాభరాపడి, "అక్కయ్యకి టెలిగ్రాం యివ్వండి" అందేమో? ఏమో? అన్నీ అర్థం లేని ప్రశ్నలే. ఎవరేనా విన్నా ఆశ్చర్యపోయే విషయాలే.

ఆలోచనలతో, ఆందోళనతో నేను ఇంట్లో అడుగుపెట్టేసరికి రుక్కూ, దాని తమ్ముడు సతీష్ కలిసి గుమ్మానికి ప్లాస్టిక్ మామిడి తోరణాలు కడుతున్నారు. నన్ను చూడగానే స్టూలు మీంచి ఒక్కదూకు దూకి-

"పెద్ద మొచ్చిందోచ్" అంటూ అరిచాడు సతీష్. రుక్కు నా వైపు చూసి నవ్వింది.

"మీ అమ్మేదే?" అని బ్యాగ్ అక్కడే టీపాయ్ మీద పెట్టాను. వంటింట్లోంచి కౌసల్య, పక్క గదిలో నుంచి వైజయంతి ఒకేసారి హాల్లోకొచ్చారు. నన్ను చూడగానే

కౌసల్య ముఖం ఒక్కసారి విప్పారింది. వైజయంతి నా మెడచుట్టూ చేతులు వేసి కౌగలించుకుంది. దాని వేషంలో వచ్చిన మార్పును గుర్తించిన నాదృష్టి, నాలో ఆలోచనల్ని చెదరగొట్టింది.

"హమ్మయ్యా...! వచ్చావా తల్లీ! నీ కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నా" అంది ఆయాసపడుతూ నా చెల్లి. రుక్కు నా కోసం చల్లని మంచినీళ్ళు తెచ్చింది. అవి తాగేటప్పటికి నాకు ప్రాణం లేచొచ్చింది.

"ఏమే కౌసీ, తెలీకడుగుతాను. టెలిగ్రాం యిప్పించి పిలిపించాల్సినంత అవసరమేమొచ్చిందీ" అన్నాను.

"చెప్తా... చెప్తా" అంటూ కౌసల్య అటూ, ఇటూ పరికించి చూసింది. వైజయంతి నన్ను వదిలి లోపలికెళ్ళిపోయింది.

"అక్కా! దీనికి సంబంధం రావడం, కుదిరిపోవడం కూడా అయిపోయింది" అంది వైజయంతి వైపు చూపిస్తూ. నేను ఉలిక్కిపడ్డాను.

"వైజయంతికా" అన్నాను గట్టిగా.

"అవును" అంది

"ఏమిటి? దానికిప్పుడు మళ్ళీ పెళ్ళా" అన్నాను చటుక్కున. కౌసల్య ముఖం అపార్థంతో, అవమానంతో నల్లబడడం గమనించాను.

"నువ్వు కూడా అలాగంటావేమిటే అక్కా?" అంది నిష్ఠూరంగా. నాకు వళ్ళు మండిపోయింది. అయినా తమాయించుకున్నాను.

"నేనేమన్నాను? దానికి పెళ్ళవడం నాకేదో ఇష్టం లేనట్లు మాట్లాడుతావేమిటి?" అన్నా.

"మరేమిటి? ఇన్నాళ్ళకి దాని అదృష్టం వెతుక్కుంటూ వస్తే..." కోపాన్ని దిగమింగడం కష్టంగా అనిపించింది.

"సర్లే విశేషాలు చెప్పు. అతనెవరు? ఏం చేస్తున్నాడు? ఏవూరు? తల్లిదండ్రులు – అన్నాను".

కౌసల్య కూడా సర్దుకుంది.

"అతను మిలటరీలో పనిచేస్తున్నాడు. మూడేళ్ళ తర్వాత సివిల్ సర్వీసు ఉద్యోగంలోకి వచ్చేస్తాట్ట. వాళ్ళు మనవాళ్ళే"

"వాళ్ళకన్ని సంగతులూ చెప్పారా?"

"ఆ... చెప్పాం. ఆ తల్లీ, ఆ చెల్లెలు ఎంతమంచి వాళ్ళో చెప్పలేం, ఎంత మర్యాదో... ఎంత మన్ననో..."

"నీకెలా తెలుసు?"

"వాళ్ళు మాట్లాడుతుంటే తెలీదూ! అంది దీర్ఘం తీస్తూ" మొదటి సంబంధం వచ్చినప్పుడూ యిలాగే అన్నారు అందామని నోటి చివరి దాకా వచ్చింది. నిగ్రహించుకున్నాను. ఏడ్చిపోతుందని జాలేసింది. పెళ్ళి చేసేదాకా ఒక పద్ధతి, మర్యాదలు, మన్ననలు, ఆ తర్వాత రెండు కుటుంబాలు బద్ధశత్రువుల్లా కొట్లాడుకోవడం మన సంస్కృతిలో భాగంగా అందరూ నమ్మి, అనుసరిస్తున్న పరిస్థితుల్లో ఆడపిల్లల జీవితాలు అన్యాయమైపోవడంలో ఆశ్చర్యమేముంది?

"వెర్రిమొద్దులా చెప్పిన ప్రతీదానికీ తలూపకు"

"మా ఇంట్లో యిలాగే అలవాటు. నాకలా వుంటేనే సయిస్తుందని గట్టిగా చెప్పు"

"మీ అయన జీతం రాగానే నీకని నాలుగొందలు తీసుకొని వేరే పెట్టుకో. లేకపోతే ఆ ఉమ్మడి కుటుంబంలో నీచేతికి చిల్లిగవ్వ చిక్కదు"

ఇవీ... కౌసల్య లాంటి తల్లులు పిల్లలకి చెప్పే జాగ్రత్తలు. అంతకు తగ్గ బొంత అవతలి వాళ్ళు. కొత్త కోడలు ఇంటి కొచ్చిందంటే ఇంట్లో ఆడాళ్ళు కొరకంచులు, మగాళ్ళు కొరివి దయ్యాలు అయి కాల్చుకు తినేస్తారు. ఆ పిల్లదాని సహనాన్ని పరీక్షిస్తారు. ముద్దు ముద్దుగా పెరిగిన వైజయంతి లాంటి ముక్కుపచ్చలారని పిల్లలు మూడు నెలలు తిరగకుండా కొన ప్రాణాలతో పుట్టింటికి చేరుతారు. ఆ తర్వాత ఆ పిల్ల అత్తింటికి వెళ్ళినా, బలికి పశువును తోలినట్టే.

"అది కాదే కౌసల్యా! దానికి పెళ్ళయి, విపరీతమైన గొడవలు జరిగి పిల్ల ప్రాణాలతో ఉంటే చాలనే స్థితిలో తీసుకొచ్చి, మూడేళ్ళు కాలేదు. దానికి విడాకులొచ్చి మూడు నెలలైంది. గాయం మానేందుకు కాస్త సమయం, అది స్వతంత్రంగా ఆలోచించుకొనేందుకు అవకాశం ఇవ్వకుండా పెళ్ళో పెళ్ళో అని ఈ గోలేమిటి" అన్నాను. నా మాటలు విసురుగా వచ్చాయి.

కౌసల్య జంకింది.

"నీకేమి నువ్వేన్నైనా చెప్తావు. మగతోడు లేకుండా ఆడదెలా ఉండగలదు?" అంది.

"ఛీ... నోర్ముయ్. మగతోడు.... అంటూ దాని బుర్రంతా చెదపురుగులా దొలిచి పారేస్తున్నావు. పెళ్ళి కోసం. మగాడు కోసం ఎదురుచూడ్డం తప్ప. ఆడదానికి మరేం

లేదని నూరిపోశావు. జీవితంలో తిన్న దెబ్బకి ఆలోచించుకునే వ్యవధి, జీవితం పట్ల అవగాహన – సొంతంగా బతికేందుకు ప్రయత్నం, వ్యక్తిత్వం లాంటి విషయాలు ఊహలోకి కూడా రాకుండా పెంచావు. స్త్రీకి వివాహం జీవితంలో ఒక భాగం. అంతేకాని అదే జీవితం కాదు. భర్త అనేవాడు తోడూ–నీడా. నిజమే కాని కూడూ–గుడ్డా కాదు. ఏం? పెళ్ళి లేకుండా అది కొన్నాళ్ళు స్వతంత్రంగా బతుకుతూ, ప్రపంచాన్ని పరిశీలించనీ, లోకం గురించి, మనుషుల గురించి తెలుసుకోని. అప్పుడు దాన్ని అర్థం చేసుకున్నవాడు కాస్త ఆదర్శవంతుడు, విశాల హృదయం గలవాడు దొరకవచ్చు కదా" నేను ఆగాను.

కౌసల్య కళ్ళల్లో నీళ్ళూరడం నేను గమనించి మరింక మాట్లాడలేదు.

"ఏదో లేవే – నీ అంత తెలివి నాకు ఎప్పుడూ లేదు" అంది.

"చాల్లే ఇలాంటి మాటలు బాగా వచ్చు అయినా అన్నీ ఫిక్స్ అయిపోయాయిగా"

"ఆ"

"సర్లే మరింక మాటలెందుకు? అన్నీ వదిలెయ్. అంతా బాగానే ఉంటుందిలే" అన్నాను.

పెళ్ళి జరిగిన తీరు చూస్తుంటే ఆశ్చర్యం, అనుమానంతో కాస్త అసహ్యం కూడా కలిగింది. మధుపర్కాలు ఎలా కట్టాలనే విషయంలో రెండు వైపుల సంప్రదాయాలు తవ్వుకున్నారు. మా మాటంటే మా మాట అనుకున్నారు. జ్యోతులు లెక్కలలో తేడా వచ్చింది. వడగంటి చీర మంచిది పెట్టలేదన్నారు. పానకం బిందెలు మరీ చిన్నవన్నారు.

ఛీ, అనిపించింది. ఆ తర్వాత నా గొడవల్లో నేనుండిపోయాను. ఉత్తరం రాద్దామనుకున్నా అశ్రద్ధ జరిగింది.

ఆ రోజు బేరింగ్‌తో వచ్చిన పెద్ద కవరు అందుకుంటూ ఎక్కణ్ణించో చూసి గతుక్కుమన్నాను. ఆత్రంగా చించాను.

అక్కా!

మూడు నెలలుగా ఉత్తరం రాద్దామని, ఆశక్తతతో ఆవహించి, కాగితం మీద కలం పెట్టగానే కన్నీళ్ళు ఆగడం కష్టమై, రాయలేకపోయాను. అగ్గిలాంటి అవమానం గుండెల్ని మండించేస్తున్నా, తిట్టినా, తిమ్మినా నువ్వు తప్ప ఎవరున్నారూ అని యిది రాస్తున్నా... వైజయంతి కాపురం కుప్పకూలిపోయింది. దాని జీవితం రెండోసారి మొదటికొచ్చింది.

కథలాంటి కౌసల్య ఉత్తరంలోని అక్షరాల మీదుగా నా చూపులు పరుగెడుతున్నాయి. సంఘటనల చిత్రాలు నా కళ్ళ ముందు కదులుతున్నాయి. మనసు బాధతో గిలగిల్లాడుతోంది.

❖ ❖ ❖

వైజయంతి భయం భయంగా చూస్తూ నిలబడింది. మిలటరీ భర్త అన్నానికి వచ్చాడు. టేబుల్ మీద అన్నీ అమర్చి ఉన్నాయి.

"అమ్మా! నాకు వెండి కుట్టుడాకులో భోజనం చేయడమంటే ఇష్టమని నీకు తెలుసుకదా! మా మావగారికి చెప్పాపెట్టకుండా సంబంధం కుదిర్చావు" అన్నాడు భాస్కరం.

"నాకేం తెలుసురా... నాయనా! అల్లుడన్నాక అచ్చటా ముచ్చటా ఉంటాయనుకున్నా - ఏడుపు ముఖాల్తో ఎదురొస్తారనుకోలేదు దీపస్తెమ్మలా - నిలబడుందిగా నీ పెళ్ళాం అదుగూ" అంది అత్తగారు.

"విన్నావా మొద్దు మొఖమా మొగుడి ముచ్చట తీర్చే ముకం కాదే యిది" అన్నాడు కసిగా.

"ఇంకా మా నాన్నదగ్గరేముందివ్వడానికి. అంతా నాకే పెడితే మిగిలిన పిల్లలకేం పెడ్తారు" అంది వైజయంతి నెమ్మదిగా.

"సన్న సన్నగా ముఖం బద్దలు కొట్టినట్లు చెప్పింది చూడు. అయినా మొదటి సంబంధం పిల్లని చేసుకోరా - ఫ్రెష్‌గా ఉంటుందంటే విన్నావా?"

నిజమే ముదనష్టం చుట్టుకునే జాతకం నాకుంటే మంచి ఆలోచనెలా వస్తుంది. చెడిన దాన్ని చేసుకుంటే బాగా ముట్టచెప్తారని ఆశపడ్డాను. దరిద్రం నా యింటికొచ్చి కూర్చుంది" మిలటరీ మొగుడు రెచ్చిపోవడం మొదలెట్టాడు.

అప్పటికే ఏడుపు ఆపుకోలేక లోపలకెళ్ళిపోయింది.

"ఇదొహటి! నోట్లోంచి మాట ఊడిపడకుండానే ఏడుపు మొదలెట్టడం - మనమేదో కొట్టి బాధిస్తున్నట్లు" సన్నాయి నొక్కులతో కర్తవ్యం బోధించింది అత్తగారు.

"ఏం మాట్లాడకుండానే ఏడుపు అందుకుంటావేమే" అంటూ తినే అన్నం వదిలి లేచి వైజయంతి జుట్టు పట్టుకుని తలవొంచి అందిన చోటల్లా పిడిగుద్దులు గుద్దేశాడు. అసలే అర్భకం. అందులో భయం. అక్కడే కూలబడిపోయింది.

"కొట్టకోరేవ్ - అది వట్టి మనిషి కూడా కాదు. అందరూ నిన్నాడి పోసుకుంటారు" అంది మహాతల్లి.

వైజయంతికి కొత్త కాదు - ఇలా మాటిమాటికి జరుగుతూంటుంది. తల్లీ కొడుకులు కట్నాలు - కానుకలు, మర్యాదలు-మన్ననలు, అచ్చట్లు -ముచ్చట్లు, గురించి వచ్చినప్పుడల్లా రెచ్చిపోయి భగ్గుభగ్గున మండిపోతూనే ఉంటారు. ఆ సెగలకి వైజయంతి వాడిపోతూనే ఉంది. ఆమె ఒళ్ళు హూనమైపోతూనే ఉంది.

కానీ ఆ రోజు అనుకోకుండా దూరపు బంధువు కౌసల్యకి స్నేహితురాలు అయిన సరోజ వైజయంతిని చూడబోయింది. ఆమె హఠాత్తుగా రావడం వల్ల వాళ్ళు కంగారుపడ్డారు. కమ్ముకోలేకపోయారు. అత్తగారు తెలివిగా.

"పిల్లకిప్పుడు ఆరో నెల. ఒకటే నడుం నొప్పి. పడుకుందని చెప్పి పంపేసింది. ఆ వచ్చిన సరోజ అనుమానపడి కౌసల్యకెళ్ళి చెప్పింది.

కౌసల్య, స్వామి ఏమీ ఎరగనట్లు వెళ్ళి పలకరించి పిల్లని నాలుగు రోజులు పంపమంటే.

"ఇప్పుడు పంపేది లేదని తెగేసి చెప్పారు. గొడవపడి పిల్లనింటికి తీసుకొచ్చారు.

ఇప్పుడు వైజయంతి వట్టి మనిషి కూడా కాదు. తన గురించే కాకుండా పుట్టబోయే బిడ్డ గురించి కూడా ఆలోచించాల్సిన స్థితిలో పడింది.

అక్కా! నువ్వు ముందే చెప్పిన మాటలు నేను అంతా అయిపోయాక ఆలోచిస్తున్నాను.

నీ ఓదార్పు కోసం

నీ కౌసల్య.

ఉత్తరం పూర్తయ్యేసరికి నా చెంపలు కన్నీళ్ళమయమై ఉన్నాయి. మన చుట్టూ జరిగే అన్యాయాల్ని, అబద్ధాల్ని ఒక ప్రేక్షకురాలిగా చూస్తూ వాళ్ళు చెప్పే గాథలు ఒక శ్రోతగా వింటూ ఉండడమే గాని మనమేం చేయలేమా? అనుకుంటూ అశాంతిగా కళ్ళు మూసుకున్నాను.

(ఆంధ్రభూమి డైలీ, ఆగస్టు 24, 1996)